# మంగమ్మగారు మోడ్రన్ డ్రెస్ మోజు

కళ్ళు తెరవగానే చిరునవ్వు చిందిస్తూ కనబడిన చిన్నికృష్ణుడికి దండం పెట్టి, నెమ్మదిగా హాల్లోకి వచ్చిన మంగపతిగారు అక్కడ కనబడిన దృశ్యం చూసి చేష్టలుడిగి నిలబడిపోయారు.




సోఫాలో కూర్చున్న మంగమ్మగారు గాలిని దంచుతున్నట్టు కుడిచేతినీ, ఎడమ చేతినీ మార్చి మార్చి పైకి కిందకి ఊపుతున్నారు. ఈ రకమైన విన్యాసం ఒక అయిదారుసార్లు చేశాక ఆవిడ ఎదురుగా ఉన్న ఖాళీ

టీపాయ్ మీదకి కుడిచేయి సాచి గుండ్రంగా ఏదో విస్రరాయిలో విసురు తున్నట్టు తిప్పడం మొదలుపెట్టింది. అటు తరువాత రెండు చేతులూ పైకెత్తి బూజు దులుపుతున్నట్టు గాలిలో అటూ ఇటూ తిప్పిందావిడ. ఇవన్నీ కూడా ఏవో భక్తిపాటలు ప్రసారం చేస్తున్న టి.వి. ఛానెల్ మీద నుండి దృష్టి మరల్చకుండా, కూర్చున్న సోఫాలో నుండి కదలకుండా చేస్తున్నదావిడ.

నిన్నటి దాకా ఆరోగ్యంగా వున్న భార్య హఠాత్తుగా ఈ విచిత్ర చేష్టలు చేయడం వలన కలిగిన షాక్ నుండి కాసేపటికి కోలుకున్నారు మంగపతిగారు.

"హాయిగా సోఫాలో వెనక్కి జారగిలబడి టి.వి. చూడక ఈ హైరాన దేనికోయ్?" ఆవిడ అలుపు తీర్చుకోవడం కోసం ఆగినప్పుడు అడిగారాయన.

"సోఫాలో పొటాటో అవ్వకూడదని ఏదో చిన్న ప్రయత్నం" అందావిడ నవ్వేసి

"ఆ మధ్య కమల కలదిండిగారు హైదరాబాదులో ఏవో యోగా క్లాసులకి వెళ్ళొచ్చారని చెప్పాను కదా! అక్కడ వాళ్లు నేర్పించే ఎక్సర్‌సైజులు ఇవేనట. పిండి రుబ్బడం, పప్పు విసరడం, వడ్లు దంచడం వంటి పనులు చేస్తునట్టుగా ఊహించుకుంటూ కాళ్ళు చేతులు కదపమన్నార్ట. అవే శ్రేష్టమయిన ఎక్సర్‌సైజులని చెప్పార్ట. ఆ కాస్తకీ అయిదు వేలు పోసి క్లాసులకి వెళ్ళడం దేనికని నేనే ప్రాక్టీస్ చేస్తున్నాను" కాస్త ఆయాసం తగ్గాక హుషారుగా చెప్పిందావిడ.

నిద్ర లేవగానే ఈ వార్త వినేసరికి మంగపతిగారికి కాస్త నీరసంగా అనిపించింది. మరేమీ మాట్లాడకుండా వెళ్లి దంతధావనాది కార్యక్రమాలు ముగించుకు వచ్చి "కాఫీ తాగుదామా?" అన్నారు పేపరు చేతిలోకి తీసుకుంటూ.

"అలాగే... గానీ మీరు కూడా కాస్త తేలికపాటి ఎక్సర్‌సైజు చేయకూడదండీ? అమెరికాలో ఈ మధ్య ఒక సర్వేలో తేలినదేమంటే హెరాయిన్ లాంటి మత్తుపదార్థాల వలన చనిపోయే వాళ్ళ సంఖ్య కన్నా ఒళ్ళు బరువు వలన చనిపోయే వాళ్ళ సంఖ్య ఎక్కువని, మనం ఈసారి విమానం ఎక్కేలోపు చక్కగా, ఉండాల్సిన బరువుతో ఆరోగ్యంగా తయారై వెళ్తే ఈ వయసులో కూడా వీళ్ళు ఎలా ఇంత చలాకీగా వున్నారబ్బా అని ఆ అమెరికన్లే ఆశ్చర్యపోవాలి" అన్నదావిడ నింపాదిగా.

"ఏమిటీ? ఆ గాల్లో రుబ్బడం, దంచడం లాంటి విన్యాసాలా?" హడలిపోతూ అడిగారు మంగపతిగారు.

"అయ్యో రామా! ఇల్లు ఊడవడం, బట్టలుతకడం, రుబ్బడం, దంపడం వగైరాలన్నీ ఆడపనులని గదా మీ మగమహారాజుల ఉద్దేశం? మీరు పక్కా మగపనులే ఎక్సర్ సైజుల రూపంలో చేయండి. ఈ లోగా నేను మీకు తాగడానికి ఏమైనా తయారు చేస్తాను" అన్నదావిడ తొణకకుండా.

"చూడు! ఈ ఆ బరువు తగ్గడాలు, ఆకర్షణీయంగా తయారవ్వడాలు నాకు పడవు. నువ్వు ప్రయత్నిస్తానంటే నాకేం అభ్యంతరం లేదు" అని చెప్పాడాయన కాస్త నిక్కచ్చిగానే.

మంగమ్మగారు ముఖం చిన్న బుచ్చుకుంది.

"ఏదో ఈసారి అమెరికా వెళ్లినప్పుడు నేను కూడా అక్కడి ఆడవాళ్ళలాగా మోడ్రన్ డ్రెస్‌లు వేసుకుని సరదా తీర్చుకోవాలనుకున్నాను" అన్నారావిడ జాలిగా.

"అక్కడి లావుపాటి పిన్నిగార్లలా నువ్వు కూడా చిన్న చిన్న చడ్డీలు, చేతుల్లేని ఇరుకు చొక్కాలు వేసుకుని తిరగాలని సరదా పడుతున్నావా?" షాక్ తిన్నట్టు అడిగారు మంగపతిగారు.

"మరీ అంత వెటకారం ఒద్దులెండి. ఏం పెద్దవాళ్ళకి జీన్స్, టీ షర్టులు, ప్యాంటు షర్టులు బాగానే వుంటాయిగా! చలిలో బయటకు వెళ్ళేటప్పుడు పిల్లలు ఎన్నిసార్లో బ్రతిమలాడారు నన్ను 'శుభ్రంగా జీన్స్ తొడుక్కుంటే వెచ్చగా వుంటుందమ్మా' అని. అందుకని కాస్త ఒళ్ళు తగ్గితే బావుంటుందని అనుకుంటే ఆదిలోనే హంసపాదు వేశారు మీరు."

మంగపతిగారికి ఆవిడ ముఖంలో కనబడిన నిరాశ చూస్తే మనసు కరిగింది. 'ఆవిడ స్కూలుకు వెళ్ళే రోజుల్లో పంజాబీ దుస్తుల సరద రాలేదు గనుక ఆ సరదా ఏమిటో తెలియకుండానే ఆవిడ తన ఇంటి ఇల్లాలు, పిల్లల తల్లీ అయిపోయిందని గుర్తొచ్చిందాయనకు. సరే ఆమెకు ప్యాంట్ షర్టులు, జీన్స్, టీ షర్టు వేసుకోవాలని కోరిక వుంటే ఆ ముచ్చట ఇండియాలో ఎలాగూ తీర్చుకోలేదు. అమెరికాలో ఎవరు ఏం తొడుక్కున్నారని అడిగే వాళ్లెవరు? పాపం ఆమె సరదామీద తను నీళ్ళు జల్లడం దేనికీ?' అనుకుని.

"అలాగేలే... నీ మాట ఎప్పుడు కాదన్నాను? నీతో బాటు నేనూ ట్రిమ్‌గా తయారవ్వాలి... అంతేనా? సరే అలా నాలుగడుగులు నడిచి వస్తాను. ఇప్పుడే కాఫీ కలపకు" అంటూ చెప్పులు తొడుక్కుని బయటకు నడిచాడాయన.

ఆయన తిరిగి వచ్చేసరికి పొగలు గ్రక్కుతున్న కప్పు అందించి, తనొక కప్పు పట్టుకుని పక్కనే కూర్చుంది మంగమ్మగారు.

కప్పు నోటి దగ్గరకు తీసుకెళ్ళిన మంగపతిగారు ముఖం రంగు మారింది. కప్పులోని పానీయం విచిత్రమైన రంగులో మందు వాసనతో వుంది.

"ఏమిటే బాబూ ఇది?" అనడిగారు.

అప్పటికే ఒక గుటికెడు త్రాగిన ఆవిడ తను కూడా ముఖం అదొకలాగ పెట్టిన మంగమ్మగారు సర్దుకుంటూ "గ్రీన్ టీ అండీ! ఆరోగ్యానికి చాలా మంచిదట. పోయిన సారి మనం వెళ్లినప్పుడు అమ్మాయి కొని పంపింది. మరిచే పోయాను ఇన్నాళ్ళూ... చైనా వాళ్ళు ఇదేనట త్రాగేది..." మరెవరో చేస్తారంటే అది గొప్ప విషయమే అయివుంటుందన్న విశ్వాసం ధ్వనించే కంఠంతో అన్నదావిడ.

కోపంగా కప్పు పక్కన పెట్టేసాడాయన. "ఈసారి అమెరికాకు నువ్వు ఒక్కదానివే వెళ్ళు. నేను రావడం లేదు" అన్నాడాయన.

మంగమ్మ గారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి "ఎంత మాట అన్నారండీ? మీరు లేకుండా నేను ఎక్కడికీ వెళ్ళను. నేను కాస్త సన్నబడి ఆ మోడ్రన్ దుస్తులలో మీ వెంట నడుస్తుంటే మీరు ఎంతో ముచ్చటపడతారనీ, గర్వపడతారనీ అనుకున్నాను. సరే మీ సహకారం లేకుండా నేనొక్క దాన్నీ ఈసన్నబడే పథకం అమలులో పెట్టలేనుగానీ... వదిలేస్తాను" అందావిడ బాధగా.

ఆవిడ అంత బేలగా మాట్లాడేసరికి మంగపతిగారికి మనసు కరిగిపోయింది.

ఆయన ఏదో అనబోయేంతలో మళ్ళీ అంది మంగమ్మగారు

"ఒక పదిరోజులు నా మాట పాటించి, నేను పెట్టింది తిని చూడండి. పది రోజులలో కనీసం అయిదు కేజీల బరువు తగ్గుతామటండీ! పద్మావతి పెద్దింటిగారు బెంగుళూరులో వృద్ధ స్థిమిత యోగా సెంటరులో చేరి నెల్లాళ్లు వుండి వచ్చింది. అక్కడ వాళ్ళకు ఎటువంటి ఆహారం పెట్టారు, ఏమేమి చేయించారు అన్ని వివరాలు కనుక్కున్నాను. ఆవిడయితే పదివేలు కట్టిందట ఫీజు, మనకి డబ్బు ఖర్చు లేకుండా ఆరోగ్యం బాగు పడుతుందంటే ఈ మాత్రం కష్టపడలేమా?" అంటూ.

మంగపతిగారు మారుమాట్లాడకుండా చల్లారి పోయిన గ్రీన్ టీని ఒక గుక్కలో మింగేశారు.

ఆరోజు ఉదయం ఫలహారంగా క్యారెట్ తురుము పెట్టిందావిడ.

భోజనాల సమయమయ్యే లోపుగానే ఇద్దరికీ కడుపులో పేగులు అరవడం మొదలు పెట్టాయి.

"నట్స్ తినడం ఆరోగ్యానికి మంచిదే లెండి" అంటూ బాదంపప్పు, జీడిపప్పు పట్టుకొచ్చింది.

"ఈ పదిరోజులూ మనం టి.వి. ముందు కూర్చునే భోజనం చేయొచ్చు" చిరునవ్వుతో అంటూ రెండు పళ్ళాలు తీసుకు వచ్చి టీపాయ్ మీద పెట్టింది మంగమ్మగారు.

హోటళ్ళలో భోజనం పళ్ళెం నిండా కప్పులలో పదార్థాలు పెట్టి ఇచ్చినట్టు పళ్ళేలలో నాలుగైదు పెద్ద కప్పులు వున్నాయి.

ఒక కప్పులో బోలెడంత పచ్చి కొబ్బరి తురుము వేసిన మొలకెత్తిన శనగలు, మరొక కప్పులో సన్నగా కోరిన ఛీస్, కొత్తిమీర, టమోటో ముక్కలు కలిసిన మొలకెత్తిన పెసలు వున్నాయి. మీగడతో వున్న గడ్డ పెరుగులో నేతిలో వేయించిన తోటకూర కాస్త కలిపి మరో కప్పులో వేసింది. మొలకెత్తిన అలసందగింజలకు సన్నగా తరిగిన కీరా దోసకాయ ముక్కలు కలిపి పైన ఒత్తుగా బంగాళా దుంపల చిప్స్ ముక్కలు చల్లి మరో కప్పులో నింపింది.

"ఇదేదో బాగానే వుంది" అనుకుంటూ తినడం మొదలు పెట్టారు మంగపతిగారు. ఇక తినలేక ఆయన వదిలేస్తుంటే "అయ్యో కష్టపడి చేశాను. ఆ కాస్తా తినేద్దురూ" అంటూ బలవంతంగా తినిపించింది. "మీకు రుచి కోసం చిప్స్ ఛీజ్ కలిపాను" అన్నది.

సాయంత్రం ఉపాహారంగా ద్రాక్షపళ్ళు, సపోటా పళ్ళు, జామ పళ్ళు ప్రేమగా మొగుడికి పెట్టి తనూ ఇష్టంగా తిన్నది మంగమ్మగారు. రాత్రికి చక్కర కలిపిన పాలలో అటుకులు + అరటిపళ్ళు!

ఇలా అయిదు రోజులు రకరకాలుగా ఈ తిండి తింటున్నా కమ్మటి నెయ్యి, వేడి అన్నం, కూరలతో భోజనం కోసం ఇద్దరికీ జిహ్వ లాగేస్తూంది. పైగా మామూలుగా చేసే వంట చాలా సులభమనిపిస్తూంది మంగమ్మగారికి ఈ తురమడాలు, తరగడాలు కన్నా.

పది రోజుల వరకు అనుకున్న ప్రణాళిక అయిదు రోజులకు కుదిరించిందావిడ. "పది రోజులలో అయిదు కే.జీలు తగ్గుతారంటే ఈ అయిదురోజుల్లో కనీసం రెండున్నర కిలోల బరువైనా తగ్గివుంటాం" అంటూ మొదట ఆయనను వెయింగ్ మెషిన్‌మీదకి ఎక్కించి చూసింది. మంగపతిగారు ఒక కిలో బరువు పెరిగారు. భయపడుతూనే తన బరువు చూసుకుందావిడ.

అవిడ రెండు కిలోలు పెరిగింది. ఇంత ఆరోగ్యకరమైన వస్తువులు పారేయడానికి మనసు రాక మధ్యలో నోట్లో వేసుకున్న దాని ఫలితం అది!

మంగపతిగారు నవ్వుతుంటే చిన్న పిల్లలా వుడుకున్నది మంగమ్మగారు.

"సరే సన్నబడితేనే మోడ్రన్ డ్రస్‌లు తొడగాలా ఏమిటి? నా ఒళ్ళు... నా ఇష్టం.." అనుకున్నదావిడ.

అనుకున్న అమెరికా ప్రయాణం దగ్గరకు రానే వచ్చింది. చెన్నైలో విమానం ఎక్కేటప్పుడు చీర కట్టుకునే వచ్చిందావిడ. సింగపూర్‌లో దిగగానే, రెస్ట్ రూముకు వెళ్ళి జీన్స్ ప్యాంటు, టీ షర్టు వేసుకుని వచ్చింది.

ఆవిడను ఆ దుస్తులలో చూడ్డం ఎలాగో వున్నా ఆవిడ సరదా కాదనలేక వూరుకున్నాడు మంగపతిగారు.

హాంకాంగ్ (షాంగై) ఎయిర్ పోర్టులో ఒక చోట కూర్చోకుండా కొత్త దుస్తులలోని స్వేచ్ఛను ఆనందంగా అనుభవిస్తూ తిరిగింది. ఫౌంటెన్ల దగ్గర, షాపుల దగ్గర నిలబడి ఫోటోలు తీయించుకుంది.

నిజం చెప్పాలంటే, మంగమ్మగారిని జీన్స్ ప్యాంట్, టీషర్టులో కొన్ని గంటలు చూసే సరికి మంగపతిగారికి కూడా ఉత్సాహం వచ్చింది. కెమెరాను 'ఆటోక్లిక్' లో పెట్టి ఆవిడ భుజాల చుట్టూ చేతులు చుట్టి నిలబడి ఫోటో దిగాడాయన.

హాంకాంగ్ నుండి శాన్‌ఫ్రాన్సిస్కోకు పది గంటలు విమాన ప్రయాణంలో అవసరం వున్నా లేకున్నా టాయ్‌లెట్‌కి వెళ్ళి వస్తూ చీరెలలో వున్న తోటి ఇండియన్ మధ్యవయస్సు ఇళ్ళాళ్ళు తన వైపు కుతూహలంగా చూడ్డం బాగా ఎంజాయ్ చేశారు మంగమ్మగారు.

"నా డ్రెస్ చూసి ఇక్కడున్న మన వాళ్ళు నేను ఎన్నో సంవత్సరాలుగా అమెరికాలో సెటిల్ అయిన బాపతు అనుకుంటున్నారు" అంటూ మంగపతిగారి చెవిలో చెప్పి సంతోషపడింది ఆవిడ.

శాన్‌ఫ్రాన్సిస్కోకు చేరగానే కరౌసిల్ నుండి సామాను ట్రాలీలో పెట్టుకుని బయటకు బయల్దేరారు భార్యభర్తలిద్దరూ.

బయట వాళ్ళకోసం ఎదురుచూస్తూంటామని చెప్పారు కూతురూ అల్లుడూ.

"ఒక్క నిముషం ఆగండి" అంటూ క్యాబిన్ లగేజిలో సిద్ధంగా పెట్టుకున్న చుడీదార్ మీద వేసుకునే దుప్పట్టా తీసి తను తొడుకున్న టీషర్టు మీద పమిటలా వేసుకుంది మంగమ్మగారు.

మంగపతిగారు ఏదో అనడానికి నోరు తెరుస్తుండగానే అవతల వైపు నుండి పరిగెత్తుకొచ్చి అమ్మను వాటేసుకుంది కూతురు.

నిముషం తరువాత అమ్మ తొడుకున్న జీన్స్ ప్యాంటు, షర్ట్‌పైన దుప్పట్టా చూసి నవ్వడం మొదలు పెట్టిందా అమ్మాయి.

"ఎందుకే నవ్వుతావు? నువ్వేగా హాయిగా వుంటుంది ఇవి తొడుక్కోమని పోయిన ఏడాది గొడవ పెట్టి కొనిచ్చావు?" చిరుకోపంగా అంది మంగమ్మగారు.

"డ్రెస్ చాలా బాగుంది గానీ పైన ఆ 'దుప్పట్టా' కాంబినేషన్ ఏమిటమ్మా?" నవ్వాపుకుంటూ అడిగింది కూతురు.

దూరం నుండి వస్తున్న అల్లుడ్ని చూస్తూ "ఎంత అమెరికా అయినా అల్లుడి ముందర పమిట లేకుండా ఎలా తిరగ్గలనే" అందావిడ. టీ షర్టుమీద వేసుకున్న చున్నీని సర్దుకుంటూ.

అందరూ విచిత్రంగా చూస్తారమ్మా" అటూ ఇటూ వెళ్తున్న ఇండియన్స్ తల్లి వైపు చూస్తూ వెళ్లడం గమనించిన కూతురు నచ్చజెప్పబోయింది.

"ఇదొక కొత్త ఫ్యాషన్ అనుకుని మీ అమెరికా వాళ్ళు ఇలా వేసుకోవడం మొదలు పెడతారు చూడు" చాలా ధీమాగా అన్నదావిడ.

"దిసీజ్ రియల్లీ నైస్" అంటూ మంగమ్మగారి చున్నీ వైపు చూసి చెప్పి ముందుకు నడిచి వెళ్ళిందొక అమెరికన్ పిల్ల.

"నేను చెప్పలేదూ?" అన్నట్టు సగర్వంగా నవ్వి ముందుకు నడిచారు మంగమ్మగారు.

● ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక - 11-5-2005 ●